నమస్తే తెలంగాణ

# జనగామ

3 | బుధవారం 24 జూలై 2024 | JANAGAON






తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం సందర్భంగా అధినేత కేసీఆర్‌ను ఉమ్మడి జిల్లా నేతలు కలిశారు. వారిలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్ తదితరులు ఉన్నారు.

# మండలి పక్షనేతగా సిరికొండ

## ఎమ్మెల్సీ మధుసూదనాచారిని నియమించిన పార్టీ అధినేత కేసీఆర్




సిరికొండ మధుసూదనాచారి

జయశంకర్ భూపాలపల్లి, జూలై 23 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ శాసన మండలి పక్షనేతగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారిని పార్టీ అధినేత కేసీఆర్ మంగళవారం నియమించారు. మధుసూదనాచారి తొలి తెలంగాణ శాసన సభాపతిగా సేవలందించారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పరకాల మండలం నర్సక్కపల్లి గ్రామానికి చెందిన సిరికొండ మధుసూదనాచారి 1982 నుంచి 1997 వరకు తెలుగుదేశం పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేశారు. వరంగల్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా, రాష్ట్ర పార్టీ కార్యాలయ కార్యదర్శిగా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా, అధికార ప్రతినిధిగా, బాధ్యతలు నిర్వర్తించారు. రాష్ట్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడిగా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌గా సుదీర్ఘ కాలం సేవలందించారు. 1994లో మొదటిసారి శాయంపేట ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి ఎన్నికై 1999 వరకు కొనసాగారు. 2000 సంవత్సరం నుంచి బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యుడిగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో కలిసి ముందుకు నడిచారు. బీఆర్‌ఎస్‌లో కార్యాలయ కార్యదర్శిగా, పొలిట్‌బ్యూరో సభ్యుడిగా, రాష్ట్ర అధికార ప్రతినిధిగా పనిచేశారు. 2014లో భూపాలపల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది శాసన సభాపతిగా సేవలందించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. 2021 డిసెంబర్ 14 నుంచి ఎమ్మెల్సీగా కొనసాగుతున్న మధుసూదనాచారికి శాసన మండలి పక్షనేతగా కేసీఆర్ అవకాశం కల్పించారు.

# 'రామప్ప'కు త్వరలో మరమ్మతులు

- కేంద్ర పురావస్తు శాఖ డీఈ చంద్రకాంత్
- కాకతీయ హెరిటేజ్ సభ్యులు, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి ఆలయ సందర్శన



రామప్ప ఆలయంలో వర్షానికి కురుస్తున్న చోటును పరిశీలిస్తున్న కేంద్ర పురావస్తు శాఖ అధికారులు, కాకతీయ హెరిటేజ్ సభ్యులు

వెంకటాపూర్, జూలై 23: మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప ఆలయానికి త్వరలో మరమ్మతులు చేపట్టనున్నట్లు కేంద్ర పురావస్తు శాఖ డీఈ చంద్రకాంత్ తెలిపారు. వర్షాలకు రామప్ప ఆలయం కురుస్తుందని వార్తా కథనాలు రావడంతో మంగళవారం కాకతీయ హెరిటేజ్ సభ్యులు, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, కేంద్ర పురావస్తు శాఖ ఏఈ కృష్ణచైతన్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఉత్తర ద్వారం, ఈశాన్య, ఆగ్నేయ, దక్షిణ దిశల్లో పిల్లర్లపై నుంచి నీళ్లు కారుతుండడాన్ని పరిశీలించారు. అనంతరం పాండరంగారావు, డీఈలు మాట్లాడుతూ గతంలోనే టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదని, మరోసారి టెండర్లు పిలిచి మరమ్మత్తులు చేస్తామన్నారు. దాంతో పాటు సోమసూత్రం మరమ్మతు, కామేశ్వరాలయ పునర్నిర్మాణం చేపడతామని, కామేశ్వరాలయ పునాదిలో సాయిల్ టెస్టు పనులు జరుగుతున్నాయని అన్నారు. వరల్డ్ హెరిటేజ్ కమిటీ 46వ సమావేశాలు ఢిల్లీలో జరుగుతున్న ఈ సమయంలో తప్పుడు సమాచారం వారికి చేరితే బాగుండదని, రామప్ప పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, రామప్పకు ప్రచారం కల్పించడంలో మీడియా పాత్ర చాలా గొప్పదని అన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్, పురావస్తు శాఖ కో ఆర్డినేటర్ కుమారస్వామి, అర్చకులు ఉమాశంకర్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

**సింగరేణితో ఆలయానికి, చెరువుకు ప్రమాదం**

**– నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు**

మండల కేంద్రం సమీపంలో సింగరేణి సంస్థ ఏర్పాటు చేయాలనుకుంటున్న ఓపెన్‌కాస్టుతో రామప్ప ఆలయంతో పాటు సరస్సుకు ప్రమాదం పొంచి ఉందని కాకతీయ హెరిటేజ్ సభ్యులు, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు అన్నారు. ఈ ప్రాంతంలో ఓపెన్‌కాస్టు ఏర్పాటు చేయడానికి కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ నుంచి అనుమతులు రాకుండా కోరామని తెలిపారు. చిన్న కదలికల వల్ల రామప్ప ఆలయం కురుస్తుందని, ఓపెన్‌కాస్టు వల్ల పూర్తిగా దెబ్బతింటుందని, రామప్పను మరో వెయ్యి సంవత్సరాలు కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.








## నిరాశపరచిన పన్నుల పెంపు

పోచమ్మమైదాన్ : లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను శాతాన్ని పెంచడం నిరాశ కలిగించింది. మొబైల్స్, బంగారం, వెండిపై కస్టమ్ డ్యూటీ తగ్గించడంతో వాటి ధరలు తగ్గడం, క్యాన్సర్ ఔషధాలపై వస్తు సేవ మినహాయింపులతో వ్యాధిగ్రస్తుల కు ఊరట కలిగింది. రానున్న ఐదేళ్లలో నైపుణ్యం గల 20లక్షల మంది యువతను తయారు చేయడం, ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకాల ప్రకటన వల్ల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. వికసిత్ భారత్ లక్ష్యంగా వరుసగా ఏడోసారి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడం వల్ల స్థిర ఆర్థిక వృద్ధి పెంపుదల, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయి.

– పీవీ నారాయణరావు, చార్టర్డ్ అకౌంటెంట్

# మళ్లీ నిరాశే

## కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు అన్యాయం

*మోదీ సర్కారు ఉమ్మడి వరంగల్ జిల్లాకు మరోసారి మొండిచేయి చూపింది. మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీ పునర్విభజన చట్టంలోని హామీల అమలుపై ఎలాంటి ప్రకటన చేయకుండా నిరాశే మిగిల్చింది. ముఖ్యంగా పదేళ్ల నుంచి కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై నాన్చివేత ధోరణి అవలంబిస్తున్న కేంద్రం ఈసారీ వాటి ఊసెత్తకుండా ఉపాధి కోసం ఎదురుచూస్తున్న యువత ఆశలపై నీళ్లు చల్లింది. అలాగే గిరిజన యూనివర్సిటీ, రైల్వే వ్యాగన్ పీవోహెచ్ నిర్మాణానికి అదనపు నిధులతో పాటు మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, వరంగల్ స్మార్ట్‌సిటీ, నియోమెట్రో ప్రాజెక్టుకు నిధుల కేటాయింపుపై ఎలాంటి స్పష్టత నివ్వలేదు. ఇక మేడారం జాతరకు జాతీయ హోదా విషయంలోనూ అదే తీరుగా వ్యవహరించింది. ఇలా దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వాటికి నిధులు కేటాయించకుండా, కొత్త ప్రాజెక్టులు మంజూరు చేయకుండా వివక్ష చూపడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.*

*– వరంగల్, జూలై 23(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే లేదు

- గిరిజన వర్సిటీకి అదనపు నిధులూ లేవు
- టెక్స్‌టైల్ పార్కుకూ కేటాయింపుల్లేవ్
- మామునూరు ఎయిర్‌పోర్టుపై అస్పష్టత
- ఉమ్మడి జిల్లా ప్రజల అసంతృప్తి

కేంద్ర బడ్జెట్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు మరోసారి అన్యాయం జరిగింది. పదేండ్లుగా ఎదురుచూస్తున్న హామీలను మోదీ సర్కారు నెరవేర్చడం లేదు. బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రస్తావన సైతం ఎక్కడా కనిపించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దాటవేత వైఖరిని ప్రదర్శించింది. ఇదే చట్టంలో పేర్కొన్న హామీల్లో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌కు నిధులను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణకు ముఖ్యంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో అమలు చేయాల్సిన హామీలను మాత్రం మరిచిపోయింది. పదేండ్లుగా చేస్తున్నట్లుగానే ఈసారీ పునర్విభజన చట్టంలోని హామీలను పక్కనబెట్టింది. 2014లో పార్లమెంట్‌లో చేసిన చట్టంలో చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీతో పాటు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా వరంగల్ యువత ఎదురుచూస్తున్న కాజీపేట కోచ్ ఫ్యాక్టరీపై కేంద్రం ప్రస్తుత బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన చేయలేదు. రైల్వే వ్యాగన్ పీవోహెచ్ షెడ్డు నిర్మాణానికి అవసరమైన నిధుల కేటాయింపుపైనా ఇదే తీరుగా వ్యవహరించింది. వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లోని యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుపై ప్రస్తుత బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇక గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియ మొదలైనా అవసరమైన నిధుల కేటాయింపుపైనా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

తెలుగు రాష్ట్రాల్లోని రెండు గిరిజన వర్సిటీలకు రూ.37 కోట్లు కేటాయిస్తున్నట్లు గత బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన యూనివర్సిటీ ఇప్పటికే ప్రారంభమైంది. తెలంగాణలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై ఇంకా స్పష్టత రాలేదు. నిధుల లేమితో కొత్తగా యూనివర్సిటీని ప్రారంభించే పరిస్థితి ఉండడం లేదని అధికారులే చెబుతున్నారు.

### ఉత్పత్తి రంగానికి ప్రాధాన్యత లేదు



కృష్ణకాలనీ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉత్పత్తి రంగానికి ప్రాధాన్యత కల్పించలేదు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన విభజన హామీల ఊసేలేదు. రాష్ట్రానికి హామీ ఇచ్చిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమను పట్టించుకోలేదు. గిరిజన యూనివర్సిటీ ములుగులో ఏర్పాటు చేసినప్పటికీ తగిన నిధులు కేటాయించలేదు. పాలమూరు ఎత్తిపోతలను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించలేదు. మూసీ ప్రక్షాళనపై రాష్ట్ర ప్రభుత్వం మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టింది. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపిందని, రాబోయే రోజుల్లో ప్రజలు సరైన బుద్ధి చెప్పడం ఖాయం.

– బందు సాయిలు, సీపీఎం భూపాలపల్లి జిల్లా కార్యదర్శి

### బీజేపీ ఎంపీలు గళ మెత్తాలి



కృష్ణకాలనీ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం చేసింది. కనీసం తెలంగాణ పదం ఉచ్ఛరించకుండా, రాష్ట్ర విభజన అంశాలను ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు కేటాయించింది. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలున్నప్పటికీ నిధులు కేటాయించలేదు. ఇప్పటికైనా తెలంగాణకు జరిగిన అన్యాయంపై బీజేపీ ఎంపీలు పార్లమెంటులో గళమెత్తాలి. ఇప్పటివరకు కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ పెట్టకుండా అన్యాయం చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీలకు కూడా నిధులు ఇవ్వకపోవడం బాధాకరం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అన్ని ప్రాంతాలను సమానంగా చూడాలని, బీజేపీ మాత్రం కొన్ని రాష్ట్రాలకే ప్రాధాన్యతనివ్వడం సరైంది కాదు. ఇప్పటికైనా ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పునరాలోచన చేసి తెలంగాణకు అవసరమైన నిధులు కేటాయించాలి.

– భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర

### కొత్తవి లేవు.. పాత వాటికీ మోక్షం లేదు..

కొత్తగా ఎలాంటి ప్రాజెక్టులను మంజూరు చేయలేదు. దీర్ఘకాలికంగా ప్రజలు డిమాండ్ చేస్తున్న వాటినీ నెరవేర్చలేదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది వరంగల్ నగరానికి స్వయంగా వచ్చి కాజీపేటలో రైల్వే వ్యాగన్ పీవోహెచ్ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీన్ని పూర్తి చేసేందుకు రూ.520 కోట్లు అవసరమవుతాయని కేంద్ర రైల్వే శాఖ అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో రూ.150 కోట్లను కేటాయించింది. ప్రస్తుత పూర్తిస్థాయి బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ఎలాంటి స్పష్టత లేదు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన ఉత్సవంగా ప్రసిద్ధిగాంచిన మేడారం జాతరకు జాతీయ హోదా గురించి ప్రస్తావించలేదు. మేడారం జాతరకు జాతీయ హోదా కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం పట్టించుకోలేదు. ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్(ఉడాన్) పథకంలో మామునూరు ఎయిర్‌పోర్టును పునరుద్ధరించాలనే ప్రతిపాదనను కేంద్రం పదేండ్లుగా పట్టించుకోవడం లేదు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రక్రియ ఇటీవల కొంత ముందుకు కదిలినట్లు అనిపించినా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. స్మార్ట్‌సిటీగా ఎంపికైన వరంగల్ నగరానికి బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు కింద ఎన్ని నిధులు కేటాయించారనేది స్పష్టత లేదు. అర్బన్ ఏరియాల్లో మెరుగైన రవాణా వ్యవస్థ కోసం నియోమెట్రో ప్రాజెక్టు నిధులపై కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. నిధుల కేటాయింపులో వివక్ష, కొత్త ప్రాజెక్టులు లేకపోవడంతో కేంద్ర బడ్జెట్‌పై ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### తెలంగాణకు మొండిచేయి చూపింది



పోచమ్మమైదాన్ : కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో అన్ని రాష్ట్రాలను సమానంగా చూడకుండా బీహార్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఈశాన్య రాష్ట్రాలకు అధిక కేటాయింపులు చేసి తెలంగాణకు మొండిచేయి చూపడం బాధాకరం. ఈ బడ్జెట్‌లో సామాన్య ప్రజలు, రైతులు, విద్య, వైద్యరంగాలకు, మౌలిక వసతుల కల్పన, రోడ్లు, రైలు, విమానాశ్రయాలు, జల రవాణా, పోర్టుల అభివృద్ధి, మహిళా అభ్యున్నతి లక్ష్యంగా వికసిత్ భారత్ సాధన దిశలో కేటాయింపులు చేయడం హర్షణీయం. అలాగే గ్రామీణ అభివృద్ధి, మహిళా సాధికారత, గ్రామీణ, పట్టణ ప్రాంతాల గృహ నిర్మాణాలు, స్కిల్ డెవలప్‌మెంట్‌లో కోటి మందికి ప్రాక్టికల్ శిక్షణ సందర్భంగా రూ.5000 భృతితో పాటు ఉపకార వేతనం చెల్లింపు ఊరట నిచ్చింది. ఎలాంటి సెక్యూరిటీ లేని రుణ సదుపాయం, ముద్ర లోను రూ.20 లక్షలకు పెంచడం అభినందనీయం.

– త్రిపురనేని గోపీచంద్, చార్టర్డ్ అకౌంటెంట్


### కొత్త పన్ను విధానం మేలే



హనుమకొండ చౌరస్తా : కొత్త పన్ను విధానంలో మార్పులు చేయడం ప్రయోజనకరమని చెప్పవచ్చు. ఆదాయపు పన్ను నోటీసులకు సంబంధించిన వ్యవధిని ఐదేళ్లకు తగ్గించడంతో ఆ శాఖ నుంచి వేధింపులు తగ్గుతాయి. ముద్ర రుణాలను రూ.20 లక్షలకు పెంచడం చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు ఉపయోగకరం. మహిళలకు ఆస్తుల రిజిస్ట్రేషన్ స్టాంప్ డ్యూటీని తగ్గించడం వారికి గుర్తింపు ఇచ్చేలా ఉంది. ఆస్తి అమ్మకంపై అందుబాటులో ఉన్న ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తీసివేశారు. దీనివల్ల ఆస్తిని విక్రయించే చాలామంది కొనుగోలు ధరను పెంచలేరు, వారి మూలధన లాభాలను తగ్గించుకోలేరు. ఇంతకుముందు మూడేళ్ల కంటే ఎక్కువ కాలం బంగారాన్ని కలిగి ఉంటే, దాని అమ్మకంపై మూలధన లాభాలు దీర్ఘకాలికంగా పరిగణించబడి 20శాతం పన్నుకు లోబడి ఉంటాయి. ఇప్పుడు 24 నెలల హోల్డింగ్ వ్యవధి తర్వాత (36 నెలల ముందు) విక్రయించిన బంగారంపై దీర్ఘకాలిక మూలధన లాభాలపై ఫ్లాట్ 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

– తిప్పర్తి రాఘవరెడ్డి, సీనియర్ చార్టర్డ్ అకౌంటెంట్


### వేతన జీవులకేదీ ఊరట



జనగామ, జూలై 23 (నమస్తే తెలంగాణ) : కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. వేతనజీవులకు ఊరట లభించలేదు. గతేడాది బడ్జెట్ రూ.1.12 లక్షల కోట్లు ఉంటే ఈసారి కొంతమేర పెరిగినప్పటికీ ఇది మొత్తం బడ్జెట్‌లో 2.59 శాతం మాత్రమే. ఈ నిధులు ఏ మాత్రం విద్యాభివృద్ధికి సరిపోవు. కనీసం 6శాతం కేటాయిస్తేనే విద్యాసంస్థలకు మౌలిక వసతులు కల్పించి, కొత్తగా ఉపాధ్యాయులను నియమించుకొని, విద్యాప్రమాణాలు పెంచుకోవచ్చు. అరకొర నిధులతో విద్యావికాసం అసాధ్యం. ఉద్యోగులపై ఆదాయ పన్ను విధానం కూడా మోసపూరితంగా ఉన్నది. ధరల పెరుగుదలకు అనుగుణంగా పన్ను మినహాయింపు కనీస ఆదాయం పెంచకపోవడం, సెక్షన్–80సీ పరిమితి పెంచకపోవడం, ఉద్యోగులకు ఏమాత్రం ఊరట ఇవ్వలేదు.

– డీ శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

### పేదలకు ఒరిగిందేమీ లేదు



పోచమ్మమైదాన్ : కేంద్ర బడ్జెట్‌తో పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఉపాధి కూలీల డిమాండ్లను పట్టించుకోలేదు. మేడిపండు లాంటి బడ్జెట్ వల్ల పేదలు, సామాన్యులకు తీవ్ర నిరాశ కలిగించింది. ధరలు, నిరుద్యోగం మరింత పెరుగుతుంది. గ్రామాల్లో పనులు లేక పట్టణాలకు వలస వెళ్లడాన్ని నిరోధించేందుకు ప్రవేశపెట్టిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నది. వీరి కోసం తగిన నిధులు కేటాయించకపోవడంతో కోట్లాది మంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నప్పటికీ కూలీలకు పనులు దొరకక అత్యంత దుర్భరంగా జీవిస్తారు. ప్రభుత్వం పునరాలోచన చేయకపోతే దేశవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుంది.

– తాటిపాముల వెంకట్రాములు, బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు

- సన్న వడ్లు ఇచ్చి.. దొడ్డు బియ్యం తీసుకునే ఎత్తుగడ
- రైస్ మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారుల కుమ్మక్కు
- సీజ్ చేసిన ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ఇతర మిల్లులకు కేటాయింపు
- రూ. 6 కోట్ల విలువైన 27 వేల బస్తాలు తరలించే యత్నం
- రెండు రోజులుగా కొనసాగుతున్న తతంగం
- హైకోర్టును ఆశ్రయించిన బాధిత రైస్ మిల్లు యజమాని
- ధర్మాసనం స్టే ఉత్తర్వులతో నిలిచిపోయిన రికవరీ
- ఉన్నది ఉన్నట్లుగా తిరిగి సీజ్ చేసిన అధికారులు

# సీఎంఆర్ రికవరీ పేరిట అక్రమ దందా!

ములుగు, జూలై 23(నమస్తే తెలంగాణ) : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) రికవరీ పేరిట ములుగు జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు, రైస్ మిల్లర్లు మరో అక్రమానికి తెరలేపారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఇందుకు సాక్ష్యంగా ఇటీవల జరిగిన పరిణామాలను ఇతర మిల్లుల యజమానులు చూపిస్తున్నారు. అధికారుల కనుసన్నల్లోనే ఈ తతంగం రెండు రోజులుగా కొనసాగుతుండగా, తాజాగా హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌తో నిలిపివేశారు. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా కేంద్రంలోని సాయి సహస్ర మిల్లు యజమాని 2020లో రూ.12 కోట్ల విలువైన సీఎంఆర్ రైస్ ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి బకాయి డబ్బులు వసూలు చేసే క్రమంలో సివిల్ సప్లై అధికారులు ఈ ఏడాది మే 3న సదరు మిల్లుపై దాడి చేసి రూ. 6 కోట్ల విలువైన 27 వేల బస్తాల ధాన్యాన్ని (రైస్ మిల్లు యజమాని గత రెండు సీజన్లలో రైతుల నుంచి ప్రైవేట్‌గా ఆర్‌ఎన్‌ఆర్ సన్న వడ్లను కొనుగోలు చేసి నిల్వ ఉంచారు) అధికారులు సీజ్ చేశారు. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు ధాన్యంతో పాటు బియ్యం కూడా ఆ మిల్లులోనే ఉన్నాయి. అయితే సీఎంఆర్ చెల్లింపు విషయమై మిల్లు యజమాని కోర్టును ఆశ్రయించాడు. ఈ క్రమంలోనే అధికారులు సీఎంఆర్ రికవరీ పేరిట సీజ్ చేసిన ధాన్యాన్ని ఇతర మిల్లులకు కేటాయిస్తున్నారు. సీజ్ చేసిన సన్న వడ్లపై కన్నేసిన కొందరు రైస్ మిల్లర్లు, యూనియన్ నాయకులు అధికారులతో కుమ్మక్కై తమకే సరఫరా చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ వడ్లను బియ్యంగా మార్చి క్వింటాకు రూ. 5 నుంచి రూ. 6 వేల వరకు విక్రయించి పెద్ద మొత్తంలో సొమ్ము చేసుకోవచ్చని, బయట మార్కెట్‌లో దొడ్డు బియ్యాన్ని తక్కువ ధరకు (రూ. 2 నుంచి రూ. 3 వేలు) కొనుగోలు చేసి ప్రభుత్వానికి అప్పగించవచ్చని పథకం రచించారు. చేసుకున్న ఒప్పందం మేరకు అధికారుల కనుసన్నల్లో ధాన్యాన్ని రెండు రోజులుగా ఆయా మిల్లులకు తరలిస్తున్నారు. అలాగే వడ్ల బస్తాలను లారీల్లోకి ఎక్కించి యూనియన్ నాయకుడికి చెందిన వే బ్రిడ్జిలోనే కాంటా పెడుతూ తూకంలో సైతం అవకతవకలకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని ఇతర రైస్ మిల్లుల యజమానులు సైతం ధ్రువీకరిస్తున్నారు. వారి దందాకు ధాన్యం తరలింపే సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొంటున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ములుగు జిల్లా కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది.



సోమవారం రైస్ మిల్లులో వడ్ల బస్తాలను లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

**హైకోర్టు స్టేతో ఆగిన రికవరీ**

రైస్ మిల్లర్లు, అధికారులు కలిసి మిల్లులోని ధాన్యాన్ని తరలించుకుపోతున్నారనే విషయమై సాయి సహస్ర మిల్లు యజమాని మంగళవారం హైకోర్టులో కేసు వేయగా ధర్మాసనం స్టే మంజూరు చేసింది. దీంతో రెండు రోజులుగా కొనసాగిన ధాన్యం రవాణా అప్పటికప్పుడు ఆగిపోయింది. సివిల్ సప్లై డీఎం రాంపతి, తహసీల్దార్ విజయ్‌భాస్కర్ హుటాహుటిన రైస్ మిల్లు వద్దకు వచ్చి ధాన్యాన్ని తరలిస్తున్న లారీలను, రైస్ మిల్లు నుంచి తరలించగా మిగిలి ఉన్న స్టాక్‌ను వీడియో రికార్డు చేసి తిరిగి మిల్లును సీజ్ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మిల్లు యజమాని నుంచి సీఎంఆర్‌ను రికవరీ చేసేందుకు ధాన్యాన్ని తరలించామని, హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఉన్నది ఉన్నట్లుగా సీజ్ చేసినట్లు తెలిపారు. కాగా, రైస్ మిల్లు యజమాని ధ్రువీకరణ లేకుండా రెండు రోజులుగా రైస్ మిల్లర్లు, లారీ యజమానులు సివిల్ సప్లయ్ అధికారులతో కుమ్మక్కై ఇష్టారీతిన ధాన్యాన్ని తరలించారని మిల్లు సూపర్‌వైజర్ తెలిపారు. స్టే ఆర్డర్ వచ్చిన తర్వాత మిల్లులో ఉన్న లారీలను ఫొటోలు తీస్తుండగా అక్కడే ఉన్న ఎస్సై బలవంతంగా ఫోన్‌ను లాక్కొని ఫొటోలు డిలీట్ చేసినట్లు ఆరోపించాడు. కాగా, సీజ్ చేసిన రైస్ మిల్లులో ఉన్న సన్న వడ్లను ఇతర మిల్లులకు తరలించే విషయంలో భారీ అవకతవకలు జరిగినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### వడ్లు ఇచ్చి.. బియ్యం తీసుకుంటాం

**– రాంపతి, సివిల్ సప్లై డీఎం**

కాగా, ఈ విషయమై సివిల్ సప్లై డీఎం రాంపతిని వివరణ కోరగా సీజ్ చేసిన మిల్లులోని ధాన్యాన్ని తరలించే క్రమంలో వడ్లను ఇతర రైస్ మిల్లర్లకు కేటాయించి వారి నుంచి బియ్యం తీసుకోనున్నట్లు చెప్పారు. ధాన్యం వివరాలు నమోదు చేసుకుంటున్నామని,రైస్ మిల్లర్‌తో చేసుకున్న ఒప్పందం మేరకు ఇచ్చిన ధాన్యానికి అనుగుణంగా బియ్యం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. అయితే ధాన్యం తరలింపులో జరుగుతున్న అవకతవకలపై కలెక్టర్ ఆరా తీసి నిజానిజాలను తేల్చడంతో పాటు బాధ్యులైన అధికారులు, రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.